AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAY.IN

14-1-2026 (Wednesday) | MAIN EDITION


## పొంగలి వండిన ప్రధాని మోదీ




**అక్షరటుడే, ఢిల్లీ:** ఢిల్లీలోని కేంద్ర మంత్రి మురుగన్ నివాసంలో జరిగిన పొంగల్ వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని గోవులకు పూజ చేసి.. అనంతరం పొంగలి వండారు. ఈ వేడుకల్లో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. వేడుకల అనంతరం మోదీ మాట్లాడుతూ.. గతేడాది తాను తమిళనాడులో జరిగిన పలు సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరైనట్లు గుర్తు చేసుకున్నారు. వెయ్యి సంవత్సరాల పురాతనమైన గంగైకొండ చోళపురం ఆలయ సందర్శన, పంబన్ వంతెన ప్రారంభోత్సవ సమయాల్లో తమిళుల చరిత్ర గొప్పతనాన్ని తెలుసుకున్నట్లు పేర్కొన్నారు.

## ప్రముఖ రచయిత్రి ఇందిరాదేవి కన్నుమూత



**అక్షరటుడే, హైదరాబాద్:** దివంగత మహాకవి గుంటూరు శేషేంద్ర శర్మ భార్య, ప్రముఖ కవయిత్రి, ఇందిరాదేవి ధన్ రాజ్ గిర్ (96) కన్నుమూశారు. హైదరాబాద్‌లోని గోషామహల్ ప్రాంతంలో ఉన్న జ్ఞాన్ బాగ్ ప్యాలెస్‌లో తుదిశ్వాస విడిచారు. బహుముఖ ప్రజ్ఞతో సాహిత్య, కళా రంగాల్లో ఆమె తనదైన ముద్ర వేశారు. 1964లో తొలి కవితా సంపుటి "ది అపోసల్" అనే పుస్తకాన్ని విడుదల చేశారు. 1965, 1966 సంవత్సరాల్లో వరుసగా మరిన్ని పుస్తకాలను రచించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో హిందీ అకాడమీకి తొలి అధ్యక్షురాలిగా, ఉర్దూ అకాడమీ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

## నష్టాల్లో ముగిసిన సూచీలు



**అక్షరటుడే, వెబ్‌డెస్క్:** దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో సూచీలు తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. చివరికి సెన్సెక్స్ 244.98 పాయింట్లు నష్టపోయి 83,382.71 వద్ద ముగియగా.. 66.70 పాయింట్లు నష్టపోయి 25,665.60 వద్ద నిఫ్టీ ముగిసింది.

## ప్రతి ఇల్లూ సౌభాగ్యంతో విలసిల్లాలి



**అక్షరటుడే, ఏపీ:** తెలుగు రాష్ట్రాల్లోని పల్లెలు సంక్రాంతి శోభతో కళకళలాడుతున్నాయని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. సంక్రాంతి అంటే భోగిమంటలు, గంగిరెద్దులు, రంగవల్లులు, హరిదాసు కీర్తనలు, సంప్రదాయ పందేలు, కొత్తదుస్తులు, పిండి వంటలేనని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రాకతో ఏపీ అంతటా ప్రశాంతత వెల్లివిరుస్తోందన్నారు.

## కెనడాలో భారతీయుడి హత్య



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కెనడాలో ఓ భారతీయుడు హత్యకు గురయ్యాడు. సర్రే నగరంలో పంజాబ్‌కు చెందిన వ్యాపారవేత్త బిందర్ గర్హా (48) ఇంటికి కొద్ది దూరంలో తీవ్రగాయాలతో పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. అతడు ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించారు.



## ట్రేడింగ్ పేరుతో డైరెక్టర్ తేజ కుమారుడికి టోకరా

**అక్షరటుడే, హైదరాబాద్:** ప్రముఖ డైరెక్టర్ తేజ కుమారుడిని ట్రేడింగ్ పేరుతో నమ్మించి దంపతులు టోకరా వేశారు. లాభాలు వస్తాయని చెప్పి రూ.72 లక్షలు కాజేశారు. అమితవ్‌కు మోతీనగర్‌కు చెందిన యార్లగడ్డ అనూష, కొండపనేని ప్రణీత్ దంపతులతో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ట్రేడింగ్ చేస్తే భారీ లాభాలు వస్తాయని వారు చెప్పారు. ట్రేడింగ్‌లో ఇన్వెస్ట్ చేయాలని వారు ఆయనకు సూచించారు. ఒకవేళ నష్టాలు వస్తే తాము ఉంటున్న అపార్ట్‌మెంట్ రాసిస్తామని హామీ ఇచ్చారు. అమితవ్ వారి మాటలు నమ్మడి పలు దశల్లో వారికి రూ.72 లక్షలు అందించాడు. అయితే ఎంతకు లాభాలు ఇవ్వకపోగా.. అసలు గురించి అడిగినా ఆ దంపతులు స్పందించలేదు. డబ్బుల కోసం నిలదీయడంతో ముఖం చాటేశారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన అమితవ్ జూబ్లీ హిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రైలుపై పడిన క్రేన్.. 22 మంది మృతి



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్ :** థాయిలాండ్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. కదులుతున్న రైలుపై క్రేన్ పడడంతో 22 మంది చనిపోయారు. బుధవారం ఉదయం ఈ ఘటన జరిగింది. బ్యాంకాక్ నుంచి థాయిలాండ్‌లోని ఈశాన్య ప్రావిన్స్‌కు వెళ్తున్న రైలుపై క్రేన్ పడింది. ఈ మార్గంలో హైస్పీడ్ రైలు ప్రాజెక్ట్ కోసం నిర్మాణ పనులు సాగుతున్నాయి. కింద రైల్వే ట్రాక్ ఉండగా.. పైన పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో ఓ క్రేన్ ప్రమాదవశాత్తు కింద పడిపోయింది. అయితే అదే సమయంలో ఆ మార్గంలో రైలు రావడంతో ఒక బోగిపై అది పడిపోయింది. ఈ ఘటనలో 22 మంది మరణించగా, కనీసం 30 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు.

**బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. రోజు రోజుకు ధరలు రాకెట్ వేగంతో దూసుకు పోతుండటంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. పసిడికి తోడు వెండి ధరలకు సైతం రెక్కలు వచ్చాయి. త్వరలో పెళ్లిల సీజన్ ప్రారంభం కానుంది. ఈ క్రమంలో రేట్లు పెరుగుతుండటంతో ఎలా కొనాలని ప్రజలు ఆలోచిస్తున్నారు. మరోవైపు భారీగా ధరలు పెరగడంతో గిరాకీ లేక దుకాణాలు వెలవెలబోతున్నాయి.**

**–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**



# బంగారం ధరల షాక్

■ గరిష్టాలకు చేరిన రేట్లు ■ వెండి సైతం అదేబాటలో.. ■ ఒక్క రోజులో రూ.15 వేల పెరుగుదల ■ సామాన్యుల ఆందోళన

సంక్రాంతి సందర్భంగా బంగారం, వెండి ధరలు మరోసారి ప్రజలకు షాక్ ఇచ్చాయి. భోగి పర్వదినం రోజున దేశవ్యాప్తంగా బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. పండుగ వేళ కొనుగోళ్లకు సిద్ధమవుతున్న వినియోగదారులకు ఈ ధరల పెరుగుదల గట్టి షాక్ ఇస్తుంది. 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,090 మేర పెరిగింది. 22 క్యారెట్ల బంగారం రూ.1,000 వరకు ఎగబాకింది. ఈ పెరుగుదలతో దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,43,770కి చేరింది. అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,31,800గా కొనసాగుతోంది.

### అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం

అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం స్పాట్ ధర ఔన్సుకు 4,586.49 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షితమైన పెట్టుబడులవైపు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలోనే బంగారానికి డిమాండ్ పెరిగి ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో కూడా ధరలు భారీగా పెరిగాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,43,620గా నమోదైంది. అలాగే 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,31,650గా ఉంది. పండుగ సీజన్ కావడంతో కొనుగోళ్లపై ధరల ప్రభావం పడే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

### రూ.3 లక్షలు దాటిన వెండి

వెండి ధరలు కూడా వినియోగదారులకు పెద్ద షాక్ ఇచ్చాయి. ఒక్కరోజులోనే కిలో వెండిపై ఏకంగా రూ.15,000 పెరిగింది. ఈ పెరుగుదలతో హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.3,07,000కు చేరింది. ఇతర ప్రాంతాల్లో వెండి ధరలు కిలోకు సుమారు రూ.2,90,000 వద్ద ట్రేడవుతున్నాయి. ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో బంగారం, వెండి ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పెట్టుబడుల పరంగా బంగారం భద్రమైన ఆస్తిగా భావించబడుతుండడంతో డిమాండ్ తగ్గే సూచనలు కనిపించడం లేదని చెబుతున్నారు.

## జిల్లాల్లో పర్యటించనున్న సీఎం



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో త్వరలో మున్సిపల్ ఎన్నికల నగరా మోగనుంది. సంక్రాంతి తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. దీంతో అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు సమాయత్తం అవుతోంది. రాష్ట్రంలో మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం పూర్తయి దాదాపు ఏడాదవుతోంది. ఇటీవల పంచాయతీ ఎన్నికలు నిర్వహించిన ప్రభుత్వం.. తాజాగా పురపోరుకు కసరత్తు చేస్తోంది. ఈ మేరకు అధికారులు సైతం ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఓటర్ల తుది జాబితా విడుదల చేశారు. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీ మెజారిటీ మున్సిపల్ పీఠాలను కైవసం చేసుకోవాలని యోచిస్తోంది. ఈ మేరకు మంత్రులు, ఎమ్మెల్యేలు ఆయా మున్సిపాలిటీల్లో గత వారం రోజులుగా అభివృద్ధి పనులకు జోరుగా శంకుస్థాపనలు చేస్తున్నారు. సీఎం సైతం జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ నెల 16, 17, 18 తేదీల్లో నిర్మల్, మహబూబ్‌నగర్, ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో సీఎం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి బహిరంగ సభల్లో ప్రసగించనున్నారు.

## జర్నలిస్టులపై ప్రభుత్వం కక్ష సాధింపు: హరీశ్‌రావు



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు చేశారు. పాలన చేతగాక పండుగ పూట జర్నలిస్టులపై కక్ష సాధింపు చర్యలకు దిగడం సిగ్గుచేటన్నారు. ఇటీవల ఓ టీవీ ఛానెల్‌లో ఐఏఎస్ అధికారిణిపై కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై విచారణకు ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. సదరు ఛానెల్ ఇన్‌పుట్ ఎడిటర్ దొంతు రమేష్, రిపోర్టర్లు పరిపూర్ణ చారి, సుధీర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. దీనిపై బుధవారం మంత్రి హరీశ్‌రావు స్పందించారు. మీ రాజకీయ వికృత క్రీడల్లో తెలంగాణ ఉద్యమకారులైన జర్నలిస్టులను బలి చేస్తారా అని మాజీ మంత్రి ప్రశ్నించారు. ఇళ్లల్లో చొరబడి అర్ధరాత్రి వేళ అరెస్టులు చేయడానికి వాళ్లేమైన తీవ్రవాదులా అన్నారు. జర్నలిస్టుల వరుస అరెస్టులను ఆయన ఖండించారు.

## డీసీఎంను ఢీకొన్న ఆర్టీసీ బస్సు..

**అక్షరటుడే, మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం మాచారం వద్ద మంగళవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు, ముందు వెళ్తున్న డీసీఎంను ఢీకొంది. సంక్రాంతి నేపథ్యంలో హైదరాబాద్ నుంచి ప్రజలు స్వగ్రామాలకు వెళ్తున్నారు. ఇలా ప్రయాణికులతో కర్నూల్ వెళ్తున్న బస్సు భారీ ప్రమాదానికి గురైంది. 44వ జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు, ముందున్న డీసీఎంను ఢీకొంది. ఈ ఘటనలో 31 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. సంక్రాంతి పండుగకు ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

## పంచాయతీలకు నిధులు విడుదల చేయనున్న కేంద్రం




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2,500 కోట్ల విడుదలకు ఓకే చెప్పింది. రాష్ట్రంలో పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో ఇన్ని రోజులు కేంద్రం నుంచి నిధులు ఆగిపోయిన విషయం తెలిసిందే. 2024 జనవరిలో సర్పంచ్‌ల పదవీకాలం ముగియగా.. మొన్నటి వరకు ప్రత్యేకాధిరుల పాలన సాగింది. దీంతో 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు కేంద్రం నుంచి నిధులు వచ్చాయి. అనంతరం నిధులు ఆగిపోయాయి. ఈ క్రమంలో కేంద్ర నిధుల కోసం ప్రభుత్వం ఇటీవల పంచాయతీ ఎన్నికలు నిర్వహించింది. కొత్తగా కొలువుదీరిన సర్పంచులకు కేంద్రం తాజాగా శుభవార్త చెప్పింది. 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తామని ప్రకటించింది.

## ఫ్లాపుల్లోనూ 'లైగర్' బ్యూటీ హవా..



**'లైగర్' సినిమాతో టాలీవుడ్‌లోకి గ్రాండ్‌గా ఎంట్రీ ఇచ్చింది అనన్య పాండే. ఈ ఒక్క సినిమాతోనే తెలుగు మార్కెట్‌లో పట్టు సాధిస్తానన్న ధీమాతోనే అడుగుపెట్టింది. కానీ లైగర్' బాక్సాఫీస్ వద్ద ఘోర పరాజయం పాలవడంతో అనన్యకు టాలీవుడ్‌లో ఆశించిన స్థాయి అవకాశాలు రాలేదు. దీంతో ఆమె దృష్టి మళ్లీ పూర్తిగా బాలీవుడ్‌పైనే కేంద్రీకృతమైంది. తెలుగులో మరో సనిమా చేసినా హిట్ పడలేదు. దీంతో టాలీవుడ్‌కు దూరంగా ఉంటూ ముంబై ఇండస్ట్రీలోనే తన స్థానం బలపర్చుకోవడంపై ఫోకస్ పెట్టింది. బాలీవుడ్‌లో ఆమెకు ఆరంభంలో మంచి బ్రేక్‌లు వచ్చినా ఆ తర్వాత పలు సినిమాలు నిరాశ పరిచాయి. 'ఖో గయే హమ్ కహానా', 'బ్యాడ్ న్యూజ్' 'సీటీఆర్ ఎల్' 'కేసరి చాప్టర్ 2' కూడా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితం ఇవ్వలేదు. అన్ని ఫ్లాప్‌ల మధ్య కూడా అనన్య పాండే కెరీర్ ఆగలేదు. ప్రస్తుతం ఆమె నటిస్తున్న 'చాంద్ మేరా దిల్' షూటింగ్ దశలో ఉంది. అంతేకాదు, మరో మూడు కొత్త చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు బాలీవుడ్ మీడియా కథనాలు వెలువడుతున్నాయి.**

- అక్షరటుడే, సినిమా డెస్క్

## కారు షోరూంలో అగ్ని ప్రమాదం

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ నగరంలో వరుస అగ్ని ప్రమాదాలు భయపెడుతున్నాయి. బుధవారం ఉదయం ఓ కారు షోరూంలో మంటలు చెలరేగాయి. అల్వాల్‌లోని ట్రూ వాల్యూ కార్ షోరూమ్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో షోరూమ్‌లోని పలు కార్లు కాలిపోయాయి. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగినట్ల సమాచారం. ఈ ఘటనలో ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

